సాక్షి
కర్నూలు
మంగళవారం। 19। నవంబర్। 2024



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ కళావేదికపై నెల్లూరుకు చెందిన నందీశ్వర కూచిపూడి కళాక్షేత్రం, విశాఖపట్నంకు చెందిన కళారాధన అకాడమీ వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



మహా వైభవంగా జలహారతి

మహానంది: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా మహానందిలోని చిన్నకోనేరు వద్ద సోమవారం రాత్రి జలహారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.81
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 97.102
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,590
అవుట్ ఫ్లో	: 7,325

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల సందడి



మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. కార్తీక మాసం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి సేవలో తరిస్తున్నారు. సోమవారం భక్తులు అధిక సంఖ్యలో మంత్రాలయానికి చేరుకున్నారు. పవిత్ర తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకున్నారు. స్వామి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తుల సందడితో శ్రీమఠం కారిడార్ ప్రాంగణం, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లు కిక్కిరిశాయి.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

కర్నూలు సిటీ: పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఫీజు చెల్లించే గడువును పెంచినట్లు డీఈఓ శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీలోపు ఫీజు చెల్లించేందుకు గడువు ఉండగా ఈ నెల 26వ తేదీ వరకు పెంచారు. రూ.50 అపరాధ రుసుంతో 19 నుంచి 25వ తేదీలోపు, రూ.200 అపరాధ రుసుంతో 26 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చే నెల 4 నుంచి 10వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ వెల్లడించారు. రెగ్యులర్ అభ్యర్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 సబ్జెక్టులకుపైగా ఉంటే రూ.125, 3 సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110, ఒకేషనల్ అభ్యర్థులకు అదనంగా రూ.60, తక్కువ వయస్సు కలిగిన అభ్యర్థులకు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం అవసరం అయితే రూ.80 ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు చెల్లింపు తదితర పూర్తి సమాచారం కోసం www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈఓ పేర్కొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి



డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

కర్నూలు (టౌన్): డ్రోన్ టెక్నాలజీపై పోలీసులు అవగాహన పెంచుకొవాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కర్నూలు నగర శివారులోని దిన్నె దేవరపాడు వద్ద ఉన్న పోలీసు శిక్షణ కేంద్రంలో డ్రోన్ టెక్నాలజీపై, సైబర్ నేరాల టెక్నాలజీపై 2 రోజుల పాటు 21 మంది పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ కెమెరాలు ఉపయోగించే పనితీరు సామర్థ్యాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 400 మందిని డ్రోన్ ఆపరేటర్స్‌గా తీర్చిదిద్దే విధంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జన సమూహం, ఊరేగింపులు, పండుగలు, గస్తీ, ఉత్సవాలలో డ్రోన్ కెమెరా టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో డ్రోన్ కెమెరాల వినియోగాన్ని కీలకం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, డీటీసీ సీఐ గౌతమి, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వామ్మో.. హాస్టళ్లు!



కోడుమూరు మండలం లద్దగిరి బీసీ హాస్టల్‌లో ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి విజిట్

పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లు బందీఖానాలను తలపిస్తున్నాయి. వసతి గృహాల చుట్టూ ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం.. శిథిలావస్థకు చేరి భయపెట్టే పైకప్పులు.. అద్దాలు పగిలిన కిటికీలు.. దోమల రొద.. చలిగాలుల బాధ.. ఇరుగైన గదులు.. చిరిగిన దుప్పట్లు.. నిద్రలేని రాత్రులు.. ఇలా ఎన్నో సమస్యలు విద్యార్థులను పీడిస్తున్నాయి. ఒక్క రోజు మాత్రమే కాదు.. అక్కడ ఉన్నన్నీ రోజులు ఈ కష్టాలు భరించాల్సిందే. హాస్టల్ విద్యార్థులకు భద్రత, సౌకర్యాలు మెరుగుపరచాలని న్యాయస్థానం ఆదేశించినా పాలకులు, అధికారుల్లో చలనం కరువైంది. సోమవారం 'సాక్షి' పరిశీలనలో వెలుగులోకి వచ్చిన హాస్టళ్లలోని విద్యార్థుల కష్టాలు చూస్తే అయ్యో పాపం అనాల్సిందే.

- వసతి గృహాల్లో సౌకర్యాలు మృగ్యం
- ఇరుకు గదుల్లో కునారిల్లుతున్న విద్యార్థులు
- ఎప్పుడు కూలుతాయో తెలియని శిథిలావస్థ భవనాలు
- పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం
- ప్రహరీలు లేక పందులు, కుక్కల స్వైర విహారం
- గురుకులాల్లో కూడా పనిచేయని సీసీ కెమెరాలు
- విద్యార్థులకు రక్షణ కరువు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. మెజార్టీ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు జిల్లాలో మొత్తం 92 ఉండగా, 19,372 మంది విద్యార్థినీ, విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనేక హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడం వల్ల ఇరుకు గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అలాగే టాయిలెట్లు, బాత్‌రూముల సమస్య కూడా వారిని వేధిస్తోంది. ముఖ్యంగా దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలే అధికంగా ఉండడంతో ఆయా భవనాలు ప్రస్తుతం పూర్తి శిథిలావస్థకు చేరాయి. పలు వసతి గృహాల్లో పైకప్పుల పెచ్చులు ఊడిపోయి చాలా ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని వసతి గృహాల్లోని కిటికీలకు రెక్కలు కూడా లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఆయా వసతి గృహాల్లోని విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలతో పాటు డా.బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లోని విద్యార్థులు కూడా పలు సమస్యలతో సతమతమవుతున్నారు.

బాలికల హాస్టళ్లకు రక్షణ అంతంతే...

ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో రక్షణ అంతంత మాత్రంగానే ఉంది. ఒకటి రెండు చోట్ల మినహా మెజార్టీ వసతి గృహాలకు ప్రహరీలు ఉన్నా ఫెన్సింగ్ లేకపోవడం వల్ల ఎప్పుడు ఏమి జరుగుతోందనని విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కళాశాల బాలికల వసతి గృహాల్లో మాత్రం సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులు సొంత డబ్బులు వెచ్చించి పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. బాలికల వసతి గృహాలకు సంబంధించి కూడా సరైన వసతులు లేకపోవడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పశ్చిమ ప్రాంతానికి హాస్టళ్లే దిక్కు ...

కరువుకు ఆలవాలమైన జిల్లాలోని పడమటి ప్రాంతానికి చెందిన విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలే దిక్కు. ఇక్కడి చాలా గ్రామాల్లోని ప్రజలు ప్రతి ఏడాది సుదూర ప్రాంతాలకు వలస వెళ్తుండడం వల్ల వారి పిల్లలను హాస్టళ్లలోనే వదలి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే పడమటి ప్రాంతాల్లోని (ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన వారు) వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. అయితే ఈ ప్రాంతాల్లోని వసతి గృహాలు పూర్తి అధ్వానంగా ఉన్నాయి.

170 మందికి నాలుగు గదులు



ఒకే గదిలో తమ ట్రంకు పెట్టులు, పుస్తకాలతో పాటు ఇరుకుగా నిద్రిస్తున్న విద్యార్థులు ఆస్పరి మండలం చిన్నహోతూరు బీసీ వసతి గృహంలోనిది ఈ చిత్రం. ఈ హాస్టల్‌లో 170 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిల్లోనే విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి. ఫ్యాన్లు లేక, గదులకు కిటికీలు లేక దోమలతో ఇబ్బంది పడుతూ.. చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు.

అద్దె భవనం.. భద్రత కరువు



తుగ్గలి మండలం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఎస్సీ హాస్టల్‌ను 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మూసేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో హాస్టల్ పునఃప్రారంభమైంది. పాత హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం అద్దె బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. భవనంపైన రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది.

ఆరుబయటనే డైనింగ్ హాల్



కృష్ణగిరి మండలం కంబాలపాడు బీసీ హాస్టల్ పరిమితి 300 మందికి కాగా ఇక్కడ 530 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో గదులు చాలక, డైనింగ్ హాల్‌తోపాటు వరండాల్లో టేబుళ్లపై ఉంటున్నారు. ఇక్కడ 50 దాకా మరుగుదొడ్లు నిర్మించినా ఐదారు తప్ప అన్ని నిరూపయోగంగా ఉన్నాయి. నీరు బయటకు వెళ్లకపోవడంతో బహిర్భూమికి బయటకు వెళ్తున్నారు. విద్యార్థులకు రోజూ ఆరుబయటే భోజనం చేస్తున్నారు.

హాస్టళ్లు	మొత్తం	సొంతభవనాలు	అద్దె భవనాలు	బాలురు	బాలికలు
సాంఘిక సంక్షేమం	37	32	05	3,597	3,317
బీసీ సంక్షేమం	44	30	14	6,251	3,889
గిరిజన సంక్షేమం	07	06	01	575	773
మైనార్టీ సంక్షేమం	04	02	02	410	560



గార్గేయపురం ఎస్సీ హాస్టల్‌లో పెచ్చులూడిన పైకప్పు

- నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులోని బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. అవసరానికి సరిపడ నీళ్ల లేక పలువురు విద్యార్థులు టీసీలు తీసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. బాత్‌రూమ్‌ల సమస్య కూడా తీవ్రంగా ఉంది. అలాగే బాలికల ఎస్సీ, బీసీ కళాశాల హాస్టళ్లలో ఎక్కడా సీసీ కెమెరాలు లేవు.
- దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్వగ్రామమైన లద్దగిరిలోని బీసీ హాస్టల్-1, 2 భవనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీంతో అధికారులు తాత్కలికంగా స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు వసతిని ఏర్పాటు చేశారు. అలాగే హాస్టళ్లలో 422 మంది విద్యార్థులకు సరిపడే బాత్‌రూమ్‌లు లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు.
- నియోజకవర్గంలోని సి.బెళగల్ గురుకుల పాఠశాలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలు ఈ ఏడాది జూన్ నెల నుంచి పనిచేయడం లేదు.
- నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో 53 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ బాలికల వసతి గృహం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది.
- పత్తికొండలోని సమీకృత ప్రభుత్వ వసతి గృహంలో 350 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా కనీసం ఒక్క వాచ్‌మెన్ కూడా లేకపోవడం గమనార్హం.
- మంత్రాలయం బీసీ హాస్టల్‌లో 110 మందికి గాను 8 మరుగుదొడ్లు ఉన్నాయి. మరుగుదొడ్లన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులందరూ కంప చెట్ల మధ్య కాల కృత్యాలు తీర్చుకుంటున్నారు.
- కోసిగి కమ్యూనిటీ హాస్టల్‌లో 12 మరుగుదొడ్లు ఉన్నా శుభ్రతకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. ప్రహరీ లేకపోవడంతో పందుల బెడద తీవ్రమయ్యింది.
- పెద్దకడుబూరు బీసీ హాస్టల్‌లోని ఓ గదిలో పెచ్చులు ఊడటంతో డైనింగ్ హాల్‌లో విద్యార్థులు నిద్రపోవాల్సి వస్తోంది.

మౌలిక వసతులు కల్పించాలి



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇవ్వాలి. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. అనేక వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు లేవు. అవసరమైన టాయ్‌లెట్లు, బాత్‌రూములు నిర్మించాల్సి ఉంది. అలాగే పలు వసతి గృహాలకు ప్రహరీగోడలు కూడా లేవు. పలు వసతి గృహాల్లో పైకప్పులు పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతాయో అనే విధంగా తయారయ్యాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పెంచిన విధంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాల్సి ఉంది.

– పీ శ్రీనివాసులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జేఏసీ అధ్యక్షుడు

భక్త కనకదాసు గొప్ప తత్వవేత్త

కర్నూలు(అర్బన్): తన కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని, సామాజిక సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వవేత్త భక్త కనకదాసు అని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. సోమవారం భక్త కనకదాసు జయంతి సందర్భంగా స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్ ఎదురుగా ఉన్న భక్త కనకదాసు విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్, కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జయంతి సభను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భక్త కనకదాసు సైన్యంలో కూడా పనిచేసి యుద్ధంలో గాయపడి తదుపరి భక్తి మార్గంలో అనేక కీర్తనలు, రచనలను చేసి సమాజానికి అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, ఆయా సంఘాల నేతలు నక్కలమిట్ట శ్రీనివాసులు, శ్రీనివాసులు, ఎంకే మద్దిలేటి, నాయకులు తిరుమలేష్, మల్లికార్జున, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



భక్త కనకదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా తదితరులు

హామీ ఇచ్చావు.. ఇల్లు ఎప్పుడిస్తావ్?

- ఇళ్ల స్థలాల కోసం కర్నూలు కలెక్టరేట్‌కు వేలాదిగా తరలివచ్చిన పేదలు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు తమకు ఇంటి నిర్మాణం కోసం మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని, రూ. 5 లక్షలు మంజూరు చేయాలంటూ వేలాది మంది పేదలు సోమవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం కర్నూలులోని సీపీఐ కార్యాలయం నుంచి వినాయక్ ఘాట్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పేదలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఎన్నికల హామీలో భాగంగా ఇళ్ల లేని వారికి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు.



న్యాయ సంస్థలు తరలిస్తే ఊరుకోం

- ఈ ప్రాంత అభివృద్ధి కోసమే గత ప్రభుత్వం న్యాయ రాజధాని ప్రకటన
- అందులో భాగంగానే లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ తదితర ఏర్పాటు
- కూటమి ప్రభుత్వం వాటిని తరలించాలనుకోవడం దుర్మార్గం
- ఉపసంహరించుకోకపోతే ఉద్యమం
- జిల్లా న్యాయవాదులు హెచ్చరిక
- నేటి నుంచి విధుల బహిష్కరణకు పిలుపు

కర్నూలు (లీగల్): గత ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. అందులో భాగంగానే రాయలసీమ ముఖ్యద్వారమైన కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి పలు న్యాయ సంస్థలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని తరలించేందుకు కుట్ర పన్నుతోంది. ఇప్పటికే కర్నూలులో ఏర్పాటైన లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌లను అమరావతికి తరలించనున్నట్లు రాష్ట్ర హైకోర్టుకు తెలపడం కూడా జరిగింది. దీనిని కర్నూలు జిల్లా న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. న్యాయ సంస్థల తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కర్నూలు బార్ అసోసియేషన్ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించింది. ఇందులో పలువురు జిల్లా న్యాయవాదులు పాల్గొని ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఐదునెలలు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పలుమార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించి బెంచ్ విషయం ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. రాయలసీమ వాసిగా ఉండి ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఏర్పాటైన సంస్థలను అమరావతికి తరలించే ఆలోచన మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ కూటమి సర్కారు వెంటనే కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఇక్కడ నుంచి ఏ ప్రభుత్వ సంస్థను తరలించమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా మాట్లాడుతూ న్యాయ సంస్థల తరలింపును అడ్డుకునేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం సీమ ప్రజల ఆగ్రహానికి గురికాకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను ఎక్కడికీ తరలించరాదన్నారు. సీనియర్ న్యాయవాదులు వై.జయరాజు, కె.ఓంకార్ మాట్లాడుతూ మీరు గతంలో మాదిరి కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తారని భావించి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని.. ఇప్పుడు మళ్లీ పాత పంథానే అవలంభిస్తే ఎలా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. రాజధాని కోస్తా ప్రాంతంలో ఉంటే హైకోర్టు రాయలసీమలో ఉండాలన్నారు. ఇది సీమ ప్రజల హక్కు అన్నారు. 2014 సంవత్సరంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి తర్వాత పట్టించుకోలేదన్నారు. టీడీపీ భాగస్వామ్య పార్టీలైనా బీజేపీ, జనసేన రాయలసీమకు హైకోర్టు తరలిస్తే తమకు అభ్యంతరం లేదని పేర్కొన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఇప్పటి వరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయకపోగా ఉన్న వాటికి అమరావతికి తరలిస్తే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా నేటి నుంచి న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించి ప్రజలతో కలసి ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటు కాకుండా చంద్రబాబు కోర్టుల్లో పిటిషన్లు వేయించి అడ్డుకొని ఈ ప్రాంతానికి తీరని ద్రోహం చేశారని సీనియర్ న్యాయవాదులు ఎం.సుబ్బయ్య, పి.సువర్ణారెడ్డి విమర్శించారు. సమావేశంలో న్యాయవాదులు బి.చంద్రుడు, శేషన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న బార్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా



సమావేశానికి హాజరైన జిల్లా న్యాయవాదులు

సీమ గొంతు కోస్తున్న బాబు



అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతంలో ఒకటైన కర్నూలును కొద్దో గొప్పో అభివృద్ధి చేద్దామని గత ప్రభుత్వం లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎయిమ్స్, ట్రిపుల్ ఐటీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్, విద్యుత్ రెగ్యులేటరీ తదితర ప్రభుత్వ సంస్థలను కర్నూలులో ఏర్పాటు చేసింది. వాటిని ఇప్పుడు చంద్రబాబు అమరావతికి తరలించి సీమ ప్రజల గొంతును కోయాలని చూడటం సరికాదు.

– వజ్రం భాస్కర్, సీనియర్ న్యాయవాది

అన్యాయాన్ని ప్రశ్నిద్దాం



సీమ ప్రాంతానికి జరిగే అన్యాయాన్ని ప్రతి న్యాయవాది ప్రశ్నించాలి. ఇందుకు వ్యక్తిగత అజెండాలను పక్కన పెట్టి సీమ ప్రజల గొంతుక వినిపిద్దాం. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసేవరకు విధులు బహిష్కరించి ప్రజా ఉద్యమం చేపట్టకపోతే న్యాయవాదులంతా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. గడిచిన 50 ఏళ్లగా సీమ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఇకనైనా మనం మేలుకోవాలి.

– వి.కృష్ణమూర్తి, న్యాయవాది

పార్టీలకు అతీతంగా ఉద్యమం



రాష్ట్ర విభజన నాటి నుంచి సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు, ప్రజలు ఆందోళనలు చేశారు. గత ప్రభుత్వం స్పందించి కొన్ని సంస్థలను కర్నూలులో ఏర్పాటు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అన్ని సంస్థలను అమరావతికి తరలించాలని చూస్తోంది. ఇది దుర్మార్గం. దీనిపై పార్టీలకు అతీతంగా ఉద్యమం చేపడతాం.

– ఆర్.నరసింహులు, న్యాయవాది

ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం



కర్నూలులో ఏర్పాటైన వివిధ న్యాయ సంబంధ సంస్థలు తరలింపును కలిసికట్టుగా అడ్డుకుందాం. సర్కారు దిగి వచ్చే వరకు పోరాడదాం. సీమ ప్రాంత అభివృద్ధిని కాంక్షించే ప్రతి రాజకీయ పార్టీ ఉద్యమానికి సహకరించి ప్రజల పక్షాన నిలవాలి. అప్పుడే ఈప్రాంతానికి న్యాయం జరుగుతుంది.

– గోపాలకృష్ణయ్య, న్యాయవాది

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధురాలు

కర్నూలు (టౌన్): రైలు నుంచి జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు సిటీ –దూపాడు మధ్య ఓ వృద్ధురాలు రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో స్టేషన్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో తానా అధ్యక్షుడు


ఆలయ ప్రాంగణంలో పనులను పరిశీలిస్తున్న ఈఓ, తానా అధ్యక్షుడు

మహానంది: కార్తీక మాసం పురస్కరించుకుని తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, ఆయన సోద రులు సోమవారం మహా నందీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రాంగణంలోని అభివృద్ధి పనులుపై చర్చించారు. నవదుర్గలు, నవ వినాయకుల వద్ద గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటుకు ఆర్థిక సా యం అందజేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయనను ఈఓ, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరిరవిశంకర అవధాని సన్మానించారు. కాగా నూతనంగా ప్రవేశపెట్టిన గంగా హారతి కార్యక్రమానికి అవసరమైన 10 రకాల హారతులతో కూడిన ఐదు సెట్లను హైదరాబాద్, సికింద్రాబాద్, కర్నూలు నగరాలకు చెందిన దొంతు నరేష్, చైతన్య, శ్రీనివాస్, మాలతి, గోవర్ధన్‌రెడ్డి, మీనాకుమారి, రోశిరెడ్డి, పరిమళ, కేవీ రమణాచారి, సునీత అందించారని ఈఓ తెలిపారు.

కర్నూలులో హాస్య 'బ్రహ్మ' సందడి



కర్నూలు కల్చరల్: ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం కర్నూలులో సందడి చేశారు. సోమవారం బిర్లా కాంపౌండ్‌లో ఓ టీస్టాల్‌ను రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌తో కలిసి బ్రహ్మానందం ప్రారంభించారు. బ్రహ్మానందాన్ని చూడడానికి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. బ్రహ్మీ అభివాదం చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. కర్నూలు ప్రజలు మంచి వాళ్లని, మంచి సినిమాలను ఎప్పటికైనా ఆదరిస్తారని బ్రహ్మానందం అన్నారు. అనంతరం టీజీ వెంకటేష్ నివాసానికి వెళ్లారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కర్నూలు (టౌన్): మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతూ ఐదుగురు పట్టుబడ్డారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. రూ.1.30 లక్షల నగదు, పేక ముక్కలు, పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సోమవారం మూడో పట్టణ పోలీసులు తెలిపారు.


వనమహోత్సవానికి ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తులు


కార్యక్రమానికి హాజరైన భక్తులు

చూసిన కనులదే భాగ్యం

- వైభవంగా లక్ష్మీనృసింహుల వనభోజన మహోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన అహోబిల క్షేత్రం


వనమహోత్సవంలో తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: లక్ష్మీనరసింహ నామస్మరణతో అహోబిలం మార్మోగింది. ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో వేంచేసిన వనభోజన మహోత్సవం కనుల పండువగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను తిలకించి పరవశించిపోయారు. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఏటా కార్తీకమాసంలో స్వామి, అమ్మవార్లను వనభోజన కార్యక్రమానికి తీసుకెళ్లి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు వేకువజామునే సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ పల్లకీలో కొలువుంచి గ్రామ శివారులోని లక్ష్మీ వనంలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉత్సవ మూర్తులను కొలువుంచాక భక్తులు వనభోజనం చేశారు. తర్వాత స్వామి, అమ్మవారిని ఊరేగింపుగా దేవాలయ ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. రాత్రి విశేష పుష్కాలంకరణ గావించిన పూల పల్లకీలో ఉత్సవ మూర్తులను కొలువుంచి మాడ వీధుల్లో గ్రామోత్సవం నర్విహించారు.

జీఓలు అమలు చేయాలి


డీఎంహెచ్ఓ కార్యాలయ ముట్టడి సందర్భంగా ఆశాలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు నిర్మలమ్మ

కర్నూలు(హాస్పిటల్): సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి బృందంతో ఫిబ్రవరి 9న రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జీఓలను అమలు చేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు నిర్మలమ్మ, గౌస్‌దేశాయ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివలక్ష్మి మాట్లాడారు. తమ ప్రభుత్వం వస్తే ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చి ఆరు నెలలైనా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయస్సును 62 ఏళ్లు చేసి ఆశ వర్కర్లకు మాత్రం 60 ఏళ్లకు ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఇంటికి పంపించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్నందున ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, ఇతర పనులను కూడా ఆశా వర్కర్లతో చేయిస్తూ అధిక ఒత్తిడికి గురిచేస్తున్నారని విమర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఇకపై సచివాలయాల్లో డ్యూటీలు ఉండవని, అర్బన్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లను వారు నివాసం ఉండే ప్రాంతానికి బదిలీ చేస్తామని, పీహెచ్‌సీ డాక్టర్‌తో సెలవు తీసుకునే వీలు కల్పిస్తామని, ఆశా వర్కర్లకు ఆర్థికభారం లేకుండా 21 రికార్డులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇచ్చే విధంగా మాట్లాడతానని, ఎన్‌సీడీ సర్వేకు ఆశా వర్కర్‌తోపాటు ఇతర ఉద్యోగులను కలిపి టీం వర్క్ చేసే విధంగా కలెక్టర్‌తో మాట్లాడి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ నగర నాయకులు మహమూద్, కుమార్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం.. అపచారం

– కొలనుభారతి క్షేత్రం ఆవరణలో సిగరెట్ తాగుతున్న పురోహితుడు, సిబ్బంది


క్షేత్రంలోని ఓ గదిలో ధూమపానం చేస్తున్న పురోహితుడు

కొత్తపల్లి: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి క్షేత్రంగా వీరాజిల్లుతున్న కొలనుభారతి దేవి ఆలయ ప్రాంగణంలో అపచారం చోటుచేసుకుంది. పురోహితుడు అమ్మవారి క్షేత్ర ప్రాంగణంలోనే సిగరెట్ తాగడం, నిబంధనలు పాటించకుండా పూజలు చేస్తుండటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భక్తుల పట్ల కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు పురోహితుడిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూరుకు చెందిన కొంత మంది భక్తులు ఆదివారం మధ్యాహ్నం 12:25 గంటలకు కొలనుభారతి క్షేత్రానికి చేరుకున్నారు. అప్పటికే ఆలయ తలుపులను పురోహితుడు చక్రపాణి శర్మ మూసివేశారు. దూరం నుంచి వచ్చామని, అమ్మవారికి చీరె, సారె సమర్పించేందుకు ఆలయ తలుపులు తెరవాలని కోరినా పురోహితుడు ససేమిరా అన్నారు. ఈ క్రమంలో భక్తులతో దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. అయినా బతిమాలడంతో తలుపు తీసి ఒకే ఒక్క నిమిషంలో మంత్రాలు చదివి పూజను మమ అనిపించి, రూ.501 చెల్లించాలని డిమాండ్ చేశారు. చేసేదేమీలేక భక్తులు రుసుం చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా అమ్మవారికి పూజ నిర్వహించే సమయంలోనూ పురోహితుడు నుదుటన కుంకుమ బొట్టు కూడా పెట్టుకోవడం లేదని ఇదేమి సంప్రదాయమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అదే రోజు క్షేత్రంలోని ఓ గదిలో పురోహితుడు కుర్చీపై, మరో సిబ్బంది కింద కూర్చొని దర్జాగా సిగరేట్ కాల్చుతూ భక్తుల కంట పడ్డారు. క్షేత్రాన్ని అపవిత్రం చేస్తున్న పురోహితుడిపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ఈఓ రామలింగారెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి, నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రులను పూజించాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పగిడ్యాల: తల్లిదండ్రులను ప్రతిఒక్కరూ పూజించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులతో మాట్లాడారు. సంప్రదాయ సమాజం ఆవిష్కృతం కావాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలను బాల్యం నుంచే నేర్పించాలన్నారు. యుక్త వయస్సు రాగానే పెళ్లిళ్లు చేసుకున్నా మగపిల్లలు వెంటనే భార్య మాట విని తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరే కాపురాలు సాగిస్తూ భయభక్తులు లేకుండా వారికి అన్నం పెట్టని పరిస్థితులను గమనిస్తున్నామని ఆయన ఆవేదన చెందారు. కుటుంబ వ్యవస్థ బలోపేతంగా ఉండాలంటే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్వామీజీలు చెప్పే బోధనలను గ్రహించి పాటించాలని కోరారు. కార్తీక మాసం శివునికి ఎంతో ఇష్టమైన మాసమని దీనిని పవిత్రంగా ఆచరించడం వల్ల పుణ్యప్రాప్తి లభిస్తుందన్నారు. రాధామనోహర్ దాస్ స్వామిజీ మాట్లాడుతూ ప్రపంచమంతా బాగుండాలని కోరుకునేది సనాతన ధర్మమన్నారు. హైందవ ధర్మాన్ని రక్షించి భావితరాలకు అందించాలని ఐకమత్యంతో హిందూత్వాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత శ్లోకాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ఫౌండేషన్ చైర్మన్ యోగేష్‌ప్రభు, బీజేపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీతామాధురి, బీజేపీ జిల్లా మోర్చా నాయకులు బీవీ సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు చల్లా దామోధర్ రెడ్డి, శిల్ప జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఇసుక రీచ్‌లకు టెండర్లు

కర్నూలు న్యూసిటీ: జిల్లాలో కొత్తగా ప్రారంభం కానున్న మూడు ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచినట్లు గనులు, భూగర్భ ఖనిజాల శాఖ ఉప సంచాలకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌతాళం మడలంలో గుడికంబాలి, నదిచాగి, మరళిలో కొత్తగా ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాటిల్లో ఇసుక తవ్వకం, నిర్వహణ కోసం ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్ల నుంచి టెండర్ల దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి 27లోపు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించినట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు రూ.10వేల రూపాయలు డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏడాది గడువుకు దరావత్తు కింద రూ.5 లక్షలు చెలించాల్సి ఉంటుందని తెలిపారు.

టీడీపీ నాయకుడి అక్రమ మైనింగ్‌కు కార్మికుడి బలి

- బండలు మీద పడి అక్కడికక్కడే మృతి
- కేసును నీరుగార్చుతున్న గని యజమాని
- గనిలోనే చనిపోయాడంటున్న మృతుని కుటుంబీకులు
- మృతుడి కాళ్లకు సున్నపురాయి మరకలు
- ఎవరూ ఫిర్యాదు చేయలేదంటున్న పోలీసులు


గని ప్రమాదంలో మృతి చెందిన శివయ్య

డోన్/ప్యాపిలి: నంద్యాల జిల్లాలో ఓ టీడీపీ నాయకుడి అక్రమ మైనింగ్‌కు కార్మికుడు బలయ్యాడు. గనిలో బండలు మీద పడి కార్మికుడు మృతి చెందినా సమీపంలోని తోటలో కాలుజారి కింద పడి చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసినా పోలీసులు ఫిర్యాదు అందలేదని అంటున్నారు. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. ప్యాపిలి మండలం చంద్రపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి, గొర్రెల పెంపకందారుల రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎర్రసాని నాగేశ్వరరావు యాదవ్, ఆయన సోదరుడు ఎర్రసాని లక్ష్మీనారాయణ (అలియాస్ లచ్చియాదవ్) వారి పొలం పక్కనే కొన్నేళ్లుగా లైమ్‌స్టోన్ (సున్నపురాయి)ని యథేచ్ఛగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. ఈ గనిలో సోమవారం హుసేనాపురం గ్రామానికి చెందిన శివయ్య (55) సున్నపు రాయిని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా కాలుజారి కిందపడటంతో పెద్ద బండ రాయి తలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, శివయ్య సమీపంలోని తోటలో కాలు జారి కింద పడి మరణించినట్లుగా గని యజమాని లచ్చి యాదవ్ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. తన తండ్రి గనిలో పనిచేస్తుండగానే మృతి చెందాడని, కాళ్లకు తెలుపు రంగు సున్నపు రాయి మరకలు కూడా ఉన్నాయని మృతుడి కుమారుడు రవి చెబుతున్నాడు. ఈ ప్రమాదంపై అధికారులు విచారణ జరిపి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు.

గతంలోనూ ముగ్గురి మృతి..

గత పదేళ్లలో టీడీపీ నాయకుడు లచ్చి యాదవ్ చేసే అక్రమ గనిలో ముగ్గురు కూలీలు ప్రమాదాల బారినపడి మృతి చెందినట్లు తెలిసింది. మృతుల కుటుంబ సభ్యులను భయపెట్టి కేసులు నమోదు కాకుండా చేశారని చెబుతున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండానే చట్ట వ్యతిరేకంగా మైనింగ్ చేస్తున్నారని చంద్రపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): అధికారం కోసం కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. సోమవారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తన సేవలను గుర్తించి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి జగనన్నకు, రాష్ట్ర నాయకత్వానికి, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ తరపున నిరంతరం పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం కన్నా మెరుగైన పథకాలు అందిస్తామని, ఇంటింటికి ఎంత మంది ఉంటే అంత మందికి సంక్షేమ పథకాలు అందిస్తామని పదే పదే చెప్పిన కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా సూపర్ సిక్స్‌ను అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని రంగాల్లో విఫలం చెందిన కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న వైస్సార్‌సీపీ సానుభూతి పరులను వేధించడం మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- ఎస్పీకి పలువురు వినతులు


ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): ' ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేసే అలవాటు ఉంది. అప్‌స్టాక్స్ ఏంజిల్-1 అనే ట్రేడింగ్ యాప్‌లో డబ్బు ఇన్వెస్ట్ చేసి విత్ డ్రా చేస్తున్నాను. సీఐఎస్‌వీ అనే ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయండి... అంటూ వాట్సాప్‌లో లింక్ వచ్చింది.. ఆ లింక్‌ను క్లిక్ చేశాను. నా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.4.80 లక్షలు ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేశా. అయితే డబ్బు విత్‌డ్రా చేస్తుంటే రావడం లేదు. డబ్బు రికవరీ చేయించండి' అని కర్నూలు నగరంలోని సంతోష్ నగర్‌కు చెందిన చాంద్‌బాషా ఫిర్యాదు చేశారు. సోమవారం కొత్తపేటలోని జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 90 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- తన పేరు మీద ఉన్న ఇల్లు, రెండున్నర ఎకరాల పొలం ఆక్రమించుకోవాలని మరుదులు శివప్ప, హనుమంతు, హింసిస్తున్నారని మద్దికెర మండలం యడవలికి చెందిన అల్లమ్మ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు పాతబస్టాండ్‌లోని శ్రీలక్ష్మీ జ్యువెలర్స్‌కు చెందిన నాయుడు (షాప్ 30) బంగారం చేసి ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని పరారయ్యాడని కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన వనజకుమారి ఫిర్యాదు చేశారు.
- ప్లాట్ ఇప్పిస్తామని చెప్పి కృష్ణ, జయరాం అనే వ్యక్తులు తన వద్ద డబ్బు తీసుకుని మోసం చేశారని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన నరసింహారెడ్డి ఫిర్యాదు చేశారు.
- తన ఎకరా పొలంలోకి అక్రమంగా వచ్చి జొన్న పంట విత్తనం నాటుకోవడమేగాకుండా కేశవులు అనే వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నాడని హాలహర్వి మండలం హాలహర్వి గ్రామానికి చెందిన హనుమంతమ్మ ఫిర్యాదు చేశారు.

చెంచు గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



చెంచు గిరిజనుల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీహెచ్ఓ ధనుంజయరెడ్డి

ఆత్మకూరు: చెంచు గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ధనుంజయ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గంలోని చెంచుల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. కొట్టాల చెరువు గ్రామానికి చెందిన గురువయ్య, విజయలక్ష్మి తమ పొలాలకు బోరుబావులు కావాలని వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి కె.జి.నాయక్, ఏపీఓ నాగార్జున, గిరిజనులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- తనకు రెండున్నర ఎకరాల పొలం కావాలని కొత్తపల్లి చెంచుగూడేనికి చెందిన ఉత్తలూరు నాగమ్మ వినతిపత్రం అందించారు.
- కొత్తపల్లి చెంచుగూడెం వరకు రోడ్లు నిర్మించాలని పలువురు గిరిజనులు విన్నవించారు.
- తన అత్తమామలకు చెందిన పొలాన్ని ఓబులేష్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని, న్యాయం చేయాలని ఓ మహిళ వినతి పత్రం అందించింది.
- తమ గూడేనికి తెలుగుగంగ కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి పొలాలకు సాగునీరు అందించాలని, చెరువులకు నీటితోపాటు ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయాలని, భూమిలేని కుటుంబాలకు భూమి ఇవ్వాలని, 31 కుటుంబాల వారికి ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలని బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డికుంటకు చెందిన గిరిజనులు అర్జీ ఇచ్చారు.

నిప్పుల వాగులో బాలిక గల్లంతు


భవ్యశ్రీ(ఫైల్)

వెలుగోడు: నిప్పుల వాగులో పదేళ్ల బాలిక గల్లంతైంది. వివరాలు.. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సుంకరి హరినాథ్‌బాబు భార్యతో పాటు కుమార్తె భవ్యశ్రీ, కుమారుడు బాలీశ్వర్‌తో కలసి భార్య పుట్టినిల్లైన అయ్యవారిపల్లె గ్రామానికి చేరుకున్నారు. కార్తీక నోములను పురస్కరించుకొని నిప్పులవాగులో స్నానం ఆచరించేందుకు తాత రామచంద్రుడు భవ్యశ్రీ, బాలీశ్వర్‌లను తీసుకొనివెళ్లాడు. స్నానం ఆచరించే సమయంలో నీటి ఉధృతి పెరిగి ఇద్దరు కొట్టుకొని పోగా బాలీశ్వర్‌ను ఒడ్డుకు చేర్చాడు. ఎంత వెతికినా భవ్యశ్రీ ఆచూకీ కనపడలేదు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబయ్య

ఆళ్లగడ్డ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ మండలం కోటకందుకూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓబయ్య (48) సోమవారం గొర్రెలకు గ్రాసం కోసం గ్రామ శివారులో ఉన్న పొలంలోకి వెళ్లాడు. అవిశ ఆకు కోసుకుంటుండగా ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మ విద్యుత్ తీగకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. అటు వైపు వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ హరి ప్రసాద్ తెలిపారు.



అర్జీలు రాయించుకుంటున్న మహిళలు

అర్జీలు.. అవస్థలు!



గత ఐదేళ్లలో ఏనాడు సంక్షేమ పథకాల కోసం అర్జీలు పట్టుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పేదలు తిరగలేదు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని ఆందోళనలు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా ఇప్పటి వరకు వీటిలో ఒక్కటీ కూడా మంజూరు చేయలేదు. దీంతో పేదలు అర్జీలు చేత పట్టుకుని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఆవరణలో పలువురు వినతులు ఇచ్చేందుకు వచ్చి అర్జీలు రాయించుకుంటూ కనిపించారు. ఎవరినీ కదిలించినా ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు